సాక్షి సిద్దిపేట
శనివారం । 18 । నవంబర్ । 2023



అవినీతి సర్కార్‌ను సాగనంపాలి

దుర్మార్గమైన పాలన చేస్తున్న కేసీఆర్ సర్కార్‌ను సాగనంపుదామని దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు.

వివరాలు 10లో ▸



భద్రతే ఆర్టీసీ ధ్యేయం

ప్రయాణికుల భద్రతే ఆర్టీసీ ధ్యేయమని జీపీపీ(గజ్వేల్-ప్రజ్ఞాపూర్) డిపో మేనేజర్ సురేఖ అన్నారు.

వివరాలు 10లో ▸

2వరకు పది పరీక్ష ఫీజు గడువు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదోతరగతి పరీక్షల ఫీజు గడువు వచ్చే నెల 2వరకు ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.50 అదనపు రుసుముతో డిసెంబర్ 12వరకు, రూ.200 అదనపు రుసుముతో డిసెంబర్ 21వరకు చెల్లించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గమనించాలన్నారు.

న్యూస్‌రీల్

20న ప్రియాంక గాంధీ రాక

హుస్నాబాద్‌లో భారీ బహిరంగ సభ



హుస్నాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 20న హుస్నాబాద్‌కు కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ రానున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రియాంక గాంధీ పాల్గొననున్నారు. సభ ఏర్పాట్లను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఏర్పాట్ల గురించి ఏసీపీ సతీష్, సీఐ కిరణ్‌లు అడిగి తెలుసుకున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగిరం చేయండి

హుస్నాబాద్‌రూరల్: ధాన్యం కొనుగోళ్లను వేగిరం చేయాలని డీఆర్డీఓ జయదేవ్ ఆర్య అన్నారు. శుక్రవారం బంజేరుపల్లి ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం విక్రయించిన వారికి త్వరగా డబ్బులు చెల్లించేలా ఆన్‌లైన్ చేయాలని సెంటర్ ఇన్‌చార్జిలకు సూచించారు. రైతులకు కావాల్సిన గన్ని బ్యాగులను ఇచ్చి తూకం వేసేందుకు సహకరించాలని చెప్పారు. కల్లాల వద్ద ధాన్యం నిల్వలు లేకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. వీరి వెంట ఏపీడీ ఓబులేష్, ఎంపీడీఓ రాఘవేంద్రరెడ్డి, ఏపీఎం శ్రీనివాస్, సీసీలు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఉద్యమకారుల రాజీనామా

గజ్వేల్‌రూరల్: బీఆర్‌ఎస్ పార్టీకి పలువురు ఉద్యమకారులు రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కొడకండ్ల గ్రామానికి చెందిన ఎడ్ల భూమయ్య, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొడకండ్ల నర్సింహులు, పార్టీ ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు క్షీరసాగరం గాలయ్యలు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ తెలంగాణ ద్రోహులకు అడ్డాగా మారిందని మండిపడ్డారు. ప్రత్యేక రాష్ట్రంలో తమ బతుకులు బాగుపడతాయని భావిస్తే నిరాశే ఎదురైందన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలేసి పోరాటంలో పాల్గొన్నామన్నారు. ఉద్యమకారులకు జరుగుతున్న అన్యాయంతో తీవ్ర మనస్తాపానికి గురై బీఆర్‌ఎస్‌కు, శాశ్వత సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వారు తెలిపారు.

నేడు చేర్యాలకు సీఎం కేసీఆర్

- మధ్యాహ్నం 3 గంటలకు ప్రజా ఆశీర్వాద సభ
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యేలు, అభ్యర్థి పల్లా

చేర్యాల(సిద్దిపేట): సీఎం కేసీఆర్ శనివారం చేర్యాలకు వస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేర్యాలలో నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమయ్యే సభ కోసం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో వేలాది మంది ప్రజలు కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు.



ముస్తాబవుతున్న వేదిక

బాంబు స్క్వాడ్ తనిఖీలు

బహిరంగ సభా వేదికతో పాటు పలు చోట్ల సీఎం ప్రత్యేక నిఘా విభాగం, బాంబు స్క్వాడ్ బృందాలు విస్తృత తనిఖీలు చేపట్టాయి. కేసీఆర్ వచ్చే మార్గం మొత్తం తమ ఆధీనంలోకి తీసుకున్నారు. బందోబస్తు కోసం 600 మంది పోలీసులను నియమించారు. నలుగురు అదనపు డీసీపీలు, ఆరుగురు ఏసీపీలు, 20మంది సీఐలు, 60మంది ఎస్‌ఐలతో పాటు ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులు, క్విక్ రెస్పాన్స్ బృందాలు బందోబస్తు విధులు నిర్వహించనున్నారు.

సీపీ శ్వేత పరిశీలన..

ప్రజా ఆశీర్వాద సభ ప్రాంగణాన్ని సీపీ శ్వేత పరిశీలించారు. బారికేడ్ల ఏర్పాటు, బహిరంగ సభ వేదిక, సభకు వచ్చే మార్గాలతో పాటు వెళ్లే సమయాల్లో తీసుకునే జాగ్రత్తలు, వీఐపీ దారులు, తదితర వాటికి సంబంధించిన జాగ్రత్తలపై పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. అంతకు ముందు బందోబస్తు ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఇదిలా ఉంటే సీఎం సభకు భారీగా ప్రజలను తరలించేందుకు బీఆర్‌ఎస్‌లోని ముఖ్యులకు బాధ్యతలు అప్పగించారు..



సభా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, రాజయ్య, అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఎన్నికల వేళ.. జంపింగ్‌ల మేళా

జోరుగా రాజకీయ వలసలు

- పార్టీలు మారుతున్న నాయకులు
- ప్రత్యర్థుల చిత్తుకు ఎత్తుకు పైఎత్తులు
- పదవులు ఆశచూపుతున్న పార్టీలు
- రసవత్తరంగా రాజకీయాలు

సాక్షి, సిద్దిపేట: శాసన సభ ఎన్నికలకు పోలింగ్ సమయం దగ్గర పడుతున్న కొద్దీ జిల్లాలో జంపింగ్ పాలిటిక్స్ జోరందుకున్నాయి. సాధారణ కార్యకర్తలు మొదలుకొని నియోజకవర్గ, మండల కీలక నేతల దాకా పార్టీలు మారుతున్నారు. పార్టీలో ఉన్న వారిని కాపాడుకోవడంతో పాటు ఇతర పార్టీల నేతలకు గాలం వేయడం, పార్టీ వీడిన వారిని మళ్లీ సొంతగూటికి ఆహ్వానించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ వ్యవహారంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. ప్రత్యర్థి వర్గాన్ని మానసికంగా కుంగదీసేందుకు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు. ఇతర పార్టీల్లో అసంతృప్తులను తమ వైపు లాక్కునేందుకు వ్యూహాలకు పదును పెడుతున్నారు.

పదవులు.. బోలెడు ఆఫర్లు

అధికారంలోకి రాగానే స్థానిక పదవుల్లో కొందరికి, రాష్ట్ర స్థాయి పదవులు మరికొందరికి అవకాశం కల్పిస్తామని ఆశచూపుతూ పార్టీలలోకి చేర్చుకుంటున్నారు. మరికొందరికి ఆర్థికంగా భరోసాను సైతం కల్పిస్తున్నారు. అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గాలోని ప్రతి గ్రామాన్ని సందర్శిస్తున్నారు. ప్రతి ఊరిలో చేరికలు ఉండేలా నాయకులు ప్రణాళికలు రచిస్తున్నారు. అన్ని పార్టీలు ప్రధానంగా మండల స్థాయి, ద్వితీయ శ్రేణి నాయకులపై దృష్టి కేంద్రీకరించారు. ఇతర పార్టీల మండలాధ్యక్షులు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, ముఖ్య నాయకులను చేర్చుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ జంపింగ్‌లు ఎక్కువ కావడంతో ప్రధాన పార్టీలకు తలనొప్పిగా మారింది.



బీఆర్‌ఎస్‌లో చేరిన కత్తి కార్తీక

కాంగ్రెస్ పార్టీ యువనేత రాహుల్ గాంధీ చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రలో పాల్గొన్న కత్తి కార్తీక దుబ్బాక టికెట్ ఆశించారు. కాంగ్రెస్ అభ్యర్థిగా చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని ప్రకటించారు. దీంతో కత్తి కార్తీక తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ నేతలు సంప్రదింపులు జరిపి సఫలీకృతం అయ్యారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి మంత్రి హరీశ్‌రావు ఆహ్వానించారు. చేర్యాల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌ను బీఆర్‌ఎస్ కండువా కప్పి మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆహ్వానించారు.

కాంగ్రెస్‌లోకి మంజులా రెడ్డి

కొన్ని ఏళ్లుగా హుస్నాబాద్‌లో పలు సేవా కార్యక్రమాలను సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులారెడ్డి నిర్వహిస్తున్నారు. రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యేగా పోటీ చేయాలన్న ఉద్దేశ్యంతో సెప్టెంబర్ 7న బీజేపీలో కిషన్‌రెడ్డి సమక్షంలో చేరారు. బీజేపీ అభ్యర్థిగా శ్రీరాంచక్రవర్తిని ప్రకటించడంతో ఈ నెల 14న మాజీ ఎంపీ, హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. చిగురుమామిడి జెడ్పీటీసీ గీకురు రవీందర్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం చేరారు.

పార్టీ మారీ.. పోటీలో నిలిచి

సిద్దిపేట నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్‌ను ఫార్మర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు చక్రధర్ గౌడ్ ఆశించారు. చివరి నిమిషంలో బీజేపీ టికెట్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డికి కేటాయించారు. దీంతో బీజేపీకి రాజీనామా చేసి బీఎస్పీ కండువా కప్పుకున్నారు. వెంటనే ఆ పార్టీ తరఫున సిద్దిపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా చక్రధర్ గౌడ్ బీఫాం అందుకుని బరిలో నిలిచారు.

ఈటలకు రాజకీయ భిక్ష పెట్టింది కేసీఆరే



గజ్వేల్‌లో మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

- ఎన్నికల వేళ బీజేపీ, కాంగ్రెస్ ఆపద మొక్కులు
- రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాల్సిందే
- మంత్రి హరీశ్‌రావు
- గజ్వేల్‌లో దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం

గజ్వేల్: బీజేపీ నేత ఈటలకు రాజకీయ భిక్ష పెట్టింది సీఎం కేసీఆరేనని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎన్నికల కోసం ఆపద మొక్కులతో ప్రజల్లోకి వస్తున్న నేతలకు బుద్ధి చెప్పాలని మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం గజ్వేల్‌లోని ప్రజ్ఞా గార్డెన్స్‌లో నిర్వహించిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ భిక్ష పెట్టిన కేసీఆర్‌పై ఈటల పోటీ చేయడం చూస్తుంటే ఆయన నియత్తు లేదనేది అర్థం అవుతోందన్నారు. హుజురాబాద్, గజ్వేల్‌కు పొంతన లేదని, రాష్ట్రంలో బీజేపీకి చోటు లేదన్నారు. అబద్ధపు మాటలు చెబుతున్న కాంగ్రెస్, బీజేపీలను తరిమి కొట్టాలన్నారు. రాష్ట్రం ప్రభుత్వం పింఛన్ పెంపు నిర్ణయం వల్ల రాష్ట్రంలోని 5.35లక్షల మంది దివ్యాంగులకు మేలు చేకూరిందన్నారు. వీరంతా నేటి ఎన్నికల్లో కథనాయకులై కేసీఆర్ భారీ మెజారిటీతో గెలుపునకు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్‌ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భూంరెడ్డి, ఫుడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి పాల్గొన్నారు. అంతకుముందు కొండపాక, వర్గల్ మండలాలకు చెందిన బీజేపీ నాయకులు మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

కాంగ్రెస్ వస్తే మళ్లీ కరువే..

జగదేవ్‌పూర్(గజ్వేల్): కాంగ్రెస్ వస్తే రాష్ట్రంలో మళ్లీ కరువు వస్తుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో రోడ్ షోలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు అబ్ధదపు మాటలతో ఓటర్లను మభ్య పెడుతున్నారని, అభివృద్ధికి సాక్ష్యం గజ్వేల్ అని తెలిపారు. తెలంగాణకు తొలి సీఎంను చేసిన ఘనత గజ్వేల్‌కే దక్కిందని, మూడోసారి గెలిపించి దక్షిణ భారతదేశంలో గజ్వేల్ ప్రజలు రికార్డు సాధించాలని కోరారు.

నేడు బతుకుల గజ్వేల్

మర్కూక్(గజ్వేల్): శివుడి తలలోనుంచి గంగమ్మ ఎట్ల పారుతుందో కొండపోచమ్మ సాగర్ నుంచి రైతుల పొలాలకు గంగమ్మ పరవళ్లు తొక్కుతోందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. మర్కూక్ మండలకేంద్రంలో శుక్రవారం రోడ్ షో నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ పదేళ్లలో మర్కూక్ దశ మారిపోయిందని ఎక్కడ చూసినా డబుల్ రోడ్లతో గ్రామాలు ఇబ్బందులు లేకుండా కనిపిస్తున్నాయన్నారు. నాడు గతుకుల గజ్వేల్‌ను నేడు బతుకుల గజ్వేల్ గా మార్చిన నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. నీళ్లు దొరకక ప్రజలు ఇబ్బందులు పడతారని బ్రహ్మంగారు చెప్పారని.. బ్రహ్మంగారు చెప్పిన కాలజ్ఞానానికి అందని విధంగా రాష్ట్రానికి గోదావరి జలాలను తెచ్చి తాగు, సాగు నీరు అందించిన ఎకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. అనంతరం పలు పార్టీలకు చెందిన పలువురు మంత్రి హరీశ్ రావు సమక్షంలో చేరారు.

ఈ సారి బీజేపీ డకౌట్

రాయపోలు(దుబ్బాక): ఐదేళ్ల క్రితం రాష్ట్రంలో బీజేపీ సాధించింది కేవలం ఒక్క సీటేనని, ఉప ఎన్నికల్లో మరో రెండు స్థానాల్లో గెలిచినప్పటికీ ప్రజల్లో వారిపై విశ్వాసం సన్నగిల్లిందని, ఈ సారి ఆ పార్టీ రాష్ట్రంలో డకౌట్ కానుందని మంత్రి హరీష్‌రావు అన్నారు. శుక్రవారం రాత్రి రాయపోలు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో మాట్లాడారు. మూడేళ్ల క్రితం అసత్యపు హామీలతో ఎమ్మెల్యేగా గెలిచిన రఘునందన్‌రావు చేసిందేమీ లేదన్నారు. నిత్యం తనతో కయ్యానికి కాలు దువ్వడం తప్ప ప్రజలకు మేలు చేసే పనులు చేయలేదన్నారు. ఈ సారి మరోసారి మోసపోవద్దన్నారు. ఇక కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం ఖతమవుతుందన్నారు. దుబ్బాక ఎమ్మెల్యేగా కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.



అభివాదం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు



రాయపోలు సభకు హాజరైన ప్రజలు

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా



రామచంద్రాపురంలో మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



కొన్నెలో ఓటర్లకు దండం పెడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

- కాంగ్రెస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి
- బచ్చన్నపేట, జిల్లా కేంద్రంలో ఇంటింటి ప్రచారం

జనగామ/బచ్చన్నపేట: శాసనసభ సాధారణ ఎన్నికల్లో స్థానికుడినైన తనను ఆదరించండి.. అందుబాటులో ఉండి అన్ని రంగాల్లో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బచ్చన్నపేట మండలంలోని రామచంద్రాపురం, కొన్నె, దబ్బగుంటపల్లి, లింగంపల్లి, మన్‌సాన్‌పల్లి, సాల్వాపూర్ గ్రామాల్లో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఆప్యాయంగా పలకరిస్తూ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. అనంతరం కొమ్మూరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే ఈ ప్రాంతాన్ని అన్ని రంగా ల్లో అభివృద్ధి చేశామని చెప్పారు. రిజర్వాయర్లను నిర్మించి దేవాదుల కెనాల్ ద్వారా జలాలను తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయగా.. అన్నదాతల కష్టాలు తీరాయని అన్నారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ సర్కారు అన్నదాతలకు ఇంత వరకు పంట రుణమాఫీ చేయలేదని, కాంగ్రెస్ మొదటి సంతకం రెండు లక్షల రుణమాఫీపై పెడుతుందని అన్నారు. ఈ ప్రాంత సమస్యలు తెలియని నాయకులు ఓట్ల కోసం వస్తున్నారని, వారిని నమ్మి మోసపోవద్దని ప్రజలను కోరారు.

పార్టీలో చేరిన పలువురు

బచ్చన్నపేట మండలం రామచంద్రాపురం ఉప సర్పంచ్ స్వాతి కాంగ్రెస్‌లో చేరారు. చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన 300 మంది కొమ్ము రవి ఆధ్వర్యాన కొన్నె గ్రామంలో, అలాగే పలు గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కొమ్మూరి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమాల్లో నాయకులు జంగిటి విద్యానాథ్, చంద్రమౌళి, మల్లారెడ్డి, మల్లేశం, ఆంజనేయులు, ఇస్తారి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కనుకయ్య, బాలకిషన్‌గౌడ్, నర్సింహులు, కనకస్వామి, ఆనందం, భాగ్యలక్ష్మి, కిష్టయ్య, వెంకటేషం, హరిబాబు, సత్యనారాయణ, యాదగిరి నర్సింహారెడ్డి, కవిత, నరేష్, బాలకిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



చేర్యాలలో విలేకరులతో మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

గడప గడపకు ప్రచారం

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ.. జనగామ పట్టణ పరిధి 24వ వార్డులో నాయకులు శుక్రవారం గడప గడపకు ప్రచారం నిర్వహించారు. పాత బీటు బజార్ హమాలీ కార్మికుల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల గురించి వివరించారు. కురుమవాడ, శివాలయం, నాగులకుంట్ల, నెహ్రూపార్క్, అండర్ బ్రిడ్జి తదితర ఏరియాల్లో ప్రచారం చేపట్టారు. జనగామ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గంగరబోయిన మల్లేశం, నాయకులు ఎర్రమల్ల సుధాకర్, మేడ శ్రీనివాస్, చెంచారపు బుచ్చిరెడ్డి, వంగాల కల్యాణిమల్లారెడ్డి, జాయ మల్లేశం, బూడిద చిన్నాగౌడ్, నోముల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన చేర్యాల మండల నాయకులతో మాట్లాడుతున్న కొమ్మూరి

కేసీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పి రావాలి..

చేర్యాల(సిద్దిపేట): సీఎం కేసీఆర్ చేర్యాల ప్రాంత ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే ఇక్కడికి రావాలి.. ఉద్యమానికి మద్దతిచ్చిన ఈ ప్రాంతానికి ఏంచేశారో చెప్పాలని కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమానికి సిద్దిపేట, గజ్వేల్ కంటే ఎక్కువ మద్దతు ఇచ్చిన చేర్యాల ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఉద్యమకారులను పక్కనబెట్టి తిట్టినవారికి, ఉద్యమ ద్రోహులకు పదవులిచ్చారని విమర్శించారు. ఏడేళ్లుగా చేర్యాల రెవెన్యూ డివిజన్ ఉద్యమం జరుగుతున్నా పట్టించుకోలేదని అన్నారు. మల్లన్న సాగర్ నీళ్లు తపాసుపల్లికి వస్తున్నాయని అబద్ధపు మాటలు చెప్పిన కేసీఆర్.. ఎక్కడ వస్తున్నాయో చూపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జెడ్పీ ఫ్లోర్‌లీడర్ గిరి కొండల్‌రెడ్డి, కౌన్సిలర్లు లింగం, సురేష్, పీఏసీఎస్ డైరెక్టర్ కొమ్ము రవి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గెలుపు కోసం మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ఓటర్లకు వివరిస్తూ హస్తం గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, కొయ్యడ శ్రీనివాస్, కనకరాజు, గ్రామ అధ్యక్షుడు పోతుగంటి రవి, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

అవసరం మేరకు అదనపు బ్యాలెట్ యూనిట్లు

కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలకు అవసరమైన మేరకు అదనపు ఈవీఎం బ్యాలెట్ యూనిట్లను కేటాయించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గానికి 380, సిద్దిపేట నియోజకవర్గానికి 341 అదనపు యూనిట్లను కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పొలిటికల్ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రికార్డు మెజారిటీలో భాగస్వామ్యమవుదాం

- మంత్రి హరీశ్‌రావుకు అండగా నిలుద్దాం
- సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి

సిద్దిపేటఅర్బన్: మంత్రి హరీశ్‌రావు రికార్డు స్థాయిలో సాధించనున్న ఓట్ల మెజార్టీలో భాగస్వామ్యం అవుదామని సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం కిష్టసాగర్, బూర్గుపల్లి, ఎన్సాన్‌పల్లి గ్రామాలలో మంత్రికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేద్దామనుకునే వారు ఒక సారి ఆలోచించుకోవాలని అన్నారు. ఏ సమస్య వచ్చినా కుటుంబ సభ్యుడిలా ముందుండి సమస్యను పరిష్కరించే నాయకుడు హరీశ్‌రావు అని గుర్తుంచుకోవాలని కోరారు. కిష్టసాగర్ గ్రామ మధిర చిల్లకాలనీలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టడం లేదని, రేషన్ కార్డులు కొత్తవి ఇవ్వాలని, నీటి సౌకర్యం లేదని మహిళలు నిరసన తెలపగా ఎన్నికల అనంతరం సమస్యలు పరిష్కరిస్తామని సుడా చైర్మన్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

సిద్దిపేటకమాన్: అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ సోమన్ టెన్జింగ్ భూటియా అన్నారు. శుక్రవారం సిద్దిపేట టూటౌన్ పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సీఐ రవికుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



చిన్నకోడూరులో పోలింగ్ స్లిప్పుల పంపిణీని పరిశీలిస్తున్న అధికారి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని పెద్దకోడూరు, చిన్నకోడూరు, మైలారం, అల్లీపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఎన్నికల అబ్జర్వర్ జయశ్రీ బోజ్ పరిశీలించారు. వసతుల కల్పనపై ఆరా తీశారు. అనంతరం ఓటర్ స్లిప్పుల పంపిణీని పరిశీలించి మాట్లాడారు. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గతంలో ఉద్రిక్తత చోటు చేసుకున్న పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆమెతో పాటు సిద్దిపేట ఆర్డీఓ రమేష్ బాబు, తహసీల్దార్ జయలక్ష్మి, ఎస్ఐ సుభాష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

సిద్దిపేటకమాన్: జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి. రఘురాం తెలిపారు. శనివారం పట్టణంలోని రవీంద్ర హైస్కూల్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రిటర్నింగ్ అధికారి వాహనం తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేటలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో చేగుంట నుంచి మెదక్‌కు వెళ్తున్న దుబ్బాక నియోజకవర్గ రిటర్నింగ్ జయచంద్రారెడ్డి వాహనాన్ని తనిఖి చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌టీ టీం లీడర్ తిరుమలేష్‌కు ఆయన పలు సూచనలు చేశారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే 3 గంటల కరెంటే..

మంత్రి తన్నీరు హరీశ్‌రావు



కుకునూరుపల్లి రోడ్ షోలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్‌కు ఓటేస్తే 3 గంటల కరెంటే ఉంటుందని వైద్యారోగ్య శాఖా మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన రోడ్ షో సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి మూడు గంటల కరెంటు సరిపోతుందంటూ కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో ఎరువుల కోసం దుకాణాల వద్ద చెప్పులను క్యూలో పెట్టిన విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. బిందెడు తాగునీళ్ల కోసం దూరం వెళ్లి తెచ్చుకున్నప్పుడు భుజాలు కాయలు కాసిన విషయం వాస్తవం కాదా అని అన్నారు. తెలంగాణలో మహా అయితే ఒకటి రెండు చోట్ల గెలిచే బీజేపీ నేత గజ్వేల్‌లో ఓట్లు దండుకునేందుకు బీసీని సీఎం చేస్తామంటూ చెబుతున్నారన్నారు. సీఎం కేసీఆర్‌ను తిప్పలు పెట్టేందుకు ఢిల్లీ నుంచి డబ్బుల సంచులతో బీజేపీ నాయకులు బయలు దేరారన్నారు. అవసరం కోసం దగ్గరికి వచ్చే కాంగ్రెస్, బీజేపీలు కావాలో.. ప్రజల ఆపద, సంపదల్లో పాలుపంచుకుంటున్న సీఎం కేసీఆర్ కావాలో ఆలోచించాలన్నారు. కరోనా కష్ట కాలంలో ఎక్కడ పోయారో ఓట్లు అడుగడానికి వచ్చే ప్రతిపక్ష పార్టీలను అడుగాలన్నారు. రూ.14 వేల కోట్లతో రైతు రుణాలు మాఫీ చేశామని, ఎన్నికల కోడ్ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న రూ.4వేల కోట్ల రుణమాఫీ ప్రక్రియను ముచ్చటగా మూడో సారి అధికారంలోకి రాగానే పూర్తి చేసి తిరిగి రుణాలు అందేలా చూస్తామన్నారు. రాష్ట్రంలో 13లక్షల2వేల 53 మంది కల్యాణ లక్ష్మి పథకంలో లబ్ధిపొందారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లు లేని పేదలందరికీ ఇంటి స్థలంతో పాటు డబుల్ బెడ్ రూంలను కట్టించి ఇచ్చే బాధ్యత తనదేనన్నారు. తెలంగాణ సంపదను పెంచి పథకాల రూపాల్లో పేదలకు పంచుతామన్నారు. 24 గంటల పాటు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ కడుపులో పెట్టుకుని కాపాడుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవిందర్, నాయకులు పొల్కంపల్లి నరేందర్, కోల సద్గుణ, పిస్క అమరేందర్, మల్లం ఐలయ్య, లక్ష్మన్‌రాజు, భూములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ...చెకింగ్‌ల గోల



గొడుగులను తొలగిస్తున్న అధికారులు



ప్రముఖ న్యాయవాది దేవునూరి రవీందర్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీస్‌లు

2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రతి వాహనాన్ని ఎన్నికల అధికారులు, పోలీస్‌లు తనిఖీలు చేస్తున్నారు. అదేవిధంగా వివిధ పార్టీలకు సంబంధించిన గొడుగులను చిరువ్యాపారులు వాడుతుండటంతో వాటిని అధికారులు తొలగిస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రంలో ఎటు చూసినా చెకింగ్‌లు కనిపిస్తున్నాయి. ప్రముఖ న్యాయవాది దేవునూరి రవీందర్ వాహనాన్ని తనిఖీ కోసం పోలీస్‌లు ఆపగానే పూర్తిగా సహకరించారు. కోటి లింగాల ఆలయం ఆవరణలో కూరగాయలు విక్రయిస్తున్న మహిళ ఎండ నుంచి రక్షించుకునేందుకు ఓ పార్టీకి సంబంధించిన గొడుగు వాడుతుండటంతో అధికారులు తొలగించారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట.

ప్రతిపక్షాలు చెప్పేవన్నీ అబద్ధాలే



పెద్దకోడూరులో మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న దృశ్యం

బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్, బీజేపీ చెప్పేవన్నీ అబద్ధాలేనని, వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ శర్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దకోడూరులో బీఆర్ఎస్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు కుల సంఘాలు బీఆర్ఎస్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు దశాబ్దాలుగా జరగని అభివృద్ధిని కేవలం పదేళ్లలోనే కేసీఆర్ పూర్తి చేశారన్నారు. కాంగ్రెస్ వారంటీ లేని గ్యారంటీలను ప్రజలు నమ్మరన్నారు. ప్రచారంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య, ఏఎంసీ చైర్మన్ వనిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ లింగమూర్తి, ఎంపీటీసీ సాయన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



చేర్యాల(సిద్దిపేట): ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని నాగపురి శివారులో శుక్రవారం జరిగింది. స్థానికులు, కొమురవెల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ కేంద్రానికి చెందిన బండోజు భానుచందర్(22) తన ద్విచక్ర వాహనంపై మేడ్చల్ వెళ్తున్నాడు. ఈక్రమంలో నాగపురి శివారులో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి నరేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలి



బెజ్జంకిలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

నిరుద్యోగ చైతన్య యాత్ర కన్వీనర్ వెంకట్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువతను మోసగించిన బీఆర్ఎస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని, ఇందుకు కాంగ్రెస్‌ను గెలిపించాలని నిరుద్యోగ చైతన్య యాత్ర కమిటీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పిలుపు నిచ్చారు. యాత్ర శుక్రవారం బెజ్జంకి చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన యాత్రను ప్రారంభించామని, రాష్ట్రవ్యాప్తంగా పర్యస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని, నామమాత్రంగా పెట్టిన పరీక్షలు సైతం సక్రమంగా నిర్వహించలేదని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాయనకు.. పాదాభివందనం



మండల పరిధిలోని విఠలాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణ శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని వేడుకున్నారు. ఓ పెద్దాయన పాదాలకు నమస్కరించి ఓటు వేయాలని అభ్యర్థించారు.

–చిన్నకోడూరు(సిద్దిపేట)



అక్కా .. కారును యాదుంచుకో..

అక్కా... మనమంతా కలిసి కారు గుర్తుకు ఓటేద్దామని.. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి ఓటు వృథా చేసుకోవద్దని స్థానిక హరీశ్ నగర్ కాలనీలో బీఆర్ఎస్ కౌన్సిలర్ కొండం కవిత సంపత్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హరీశన్నను అధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

–సిద్దిపేటజోన్



ఎన్నికల 'గారె'ఢీ

పట్టణంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డితో కలిసి కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ వినూత్నంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిరు వ్యాపారుల వద్దకు వెళ్లి గారెలు వేపుతూ.. పండ్లు అమ్ముతూ ఓటు వేయాలని అభ్యర్థించారు.

– హుస్నాబాద్

పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి

సిద్దిపేట జిల్లా సీపీ శ్వేత



మాట్లాడుతున్న సీపీ శ్వేత

కోహెడ(హుస్నాబాద్): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కోహెడ పీఎస్‌లో శుక్రవారం సిద్దిపేట సీపీ శ్వేత సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సీఐ కిరణ్‌ను ఆదేశించారు. ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోహెడ, అక్కన్నపేట ఎస్ఐలు తిరుపతి, వివేక్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సిద్దిపేట జిల్లా సీపీ శ్వేత అన్నారు. శుక్రవారం అక్కన్నపేట మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాలో ఫ్రీ అండ్ ఫేర్‌గా ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పని చేయాలన్నారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమయ్యారు. ఎన్నికల కోడ్, బైండోవర్ కేసులు, నాందేలబుల్ వారెంట్ ఎగ్జిక్యూటివ్, ప్రైవేట్ గన్ డిపాజిట్, సీజ్ చేసిన డబ్బులు, ఫ్లాగ్ మార్చ్ తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్, ఎస్సై తాండ్ర వివేక్ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



డీఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బెజ్జంకి(సిద్దిపేట): పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలలో 100శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండలంలోని వడ్లూరు బేగంపేట, రేగులపల్లె, కల్లెపెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యం, హాజరు వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బేగంపేట పాఠశాలలో డీఈఓని సన్మానించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి మహతి లక్ష్మి, హెచ్ఎంలు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే ఆర్టీసీ ధ్యేయం



సిబ్బందిని సన్మానిస్తున్న డిపో మేనేజర్ సురేఖ తదితరులు

గజ్వేల్‌రూరల్: ప్రయాణికుల భద్రతే ఆర్టీసీ ధ్యేయమని జీపీపీ(గజ్వేల్–ప్రజ్ఞాపూర్) డిపో మేనేజర్ సురేఖ పేర్కొన్నారు. రోడ్ సేఫ్టీ డేని పురస్కరించుకొని శుక్రవారం డిపోలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాశశితో కలిసి డిపో పరిధిలోని ఉత్తమ డ్రైవర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 26 ఏళ్లుగా ఒక్క ప్రమాదం జరగకుండా విధులు నిర్వహించిన ఎండి మోసిన్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లకు ప్రగతి చక్రం పురస్కారాలు, మెకానిక్ సెక్షన్‌లో సేవలందిస్తున్న పలువురికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

అవినీతి సర్కార్‌ను సాగనంపాలి

దుబ్బాక బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు



శిలాజీనగర్‌లో ఇంటింటా ప్రచారం చేస్తున్న మాధవనేని రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: ఏ లక్ష్యం కోసం తెలంగాణను తెచ్చుకున్నామో.. ఆ ఫలాలను ప్రజలకు దక్కనీయకుండా దుర్మార్గమైన పాలన చేస్తున్న కేసీఆర్ సర్కార్‌ను సాగనంపుదామని దుబ్బాక బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం తప్ప.. ఎవరూ బాగుపడలేదని విమర్శించారు. శుక్రవారం పట్టణంలో రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదేళ్ల కేసీఆర్ పాలనలో కొత్తగా ఎంతమందికి నౌకర్లు, కొత్త రేషన్ కార్డులు వచ్చాయని ప్రశ్నించారు. గిదా బంగారు తెలంగాణ అని విమర్శించారు. తెలంగాణ కోసం అమరులైన కుటుంబాలు శోకంతో కుమిలిపోతుంటే..కేసీఆర్ కుటుంబం మాత్రం అందినంత దోచుకొని సంతోషంగా పబ్బం గడుపుతుందన్నారు.

హరీశ్ ఎంత తిరిగితే అంత మంచిది..

హరీశ్‌రావు దుబ్బాక నియోజకవర్గంలో ఎంత తిరిగితే మాకు అంత మంచిదని రఘునందన్‌రావు అన్నారు.హరీశ్ దుబ్బాకలో చెల్లని రూపాయి అని, గత ఉప ఎన్నికల్లోనే అది రుజువైందన్నారు. దుబ్బాక ప్రజల చైతన్యం ముందు హరీశ్ డ్రామాలు, కల్లబొల్లి మాటలు, పిట్ట కథలు నడవవన్నారు. అసలు దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డా..హరీశ్‌రావా ప్రజలు ఆలోచించాలని కోరారు. ఈ ఎన్నికల్లో హరీశ్‌కు మరోసారి ఓటమి రుచి చూపిస్తామన్నారు.

ప్రజల ఆశీర్వాదంతో గెలుస్తా..

ప్రజల ఆశీర్వాదంతో దుబ్బాకలో భారీ మెజార్టీతో గెలుపొందుతానని రఘునందన్‌రావు అన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు తండోపతండాలుగా స్వచ్ఛందంగా తరలివస్తూ ఘనస్వాగతం పలుకుతున్నారని తెలిపారు. ప్రజలు ఆదరణ చూస్తుంటే పెద్ద మెజార్టీ సాధిస్తానన్న ధీమాను వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందన్నారు.

ఒక్క రేషన్ కార్డు రాకపాయే..

దౌల్తాబాద్(దుబ్బాక): పదేళ్ల సీఎం కేసీఆర్ పాలనలో ఒక్క నిరుపేద కుటుంబానికి కూడా రేషన్ కార్డు ఇవ్వలేదని రఘునందన్‌రావు విమర్శించారు. శుక్రవారం కోనాపూర్, మహ్మద్‌షాపూర్, తిర్మలాపూర్ గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ప్రభుత్వం నిధులు విడుదల చేయక కోనాపూర్‌లో డబుల్ బెడ్‌రూంలు అసంపూర్తిగా మిగిలిపోయాయని ఆరోపించారు. గ్రామాల్లో సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం పైసల్ ఇవ్వకా ఉరి వేసుకొని ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు చాలా ఉన్నాయన్నారు. చదువుకున్న విద్యార్థులను మోసం చేసిన సీఎం కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కిషన్, సర్పంచ్ పంచామి స్వామి, భూపాల్‌రెడ్డి, రామస్వామిగౌడ్, కుమ్మరి నర్సింహులు, అనిల్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.



కోనాపూర్‌లో ఎన్నికల ప్రచారం



గంభీర్‌పూర్‌లో భారీగా తరలివచ్చిన జనం

రుణ మాఫీ చేయడంలో విఫలం

దుబ్బాకరూరల్: గంభీర్‌పూర్, శిలాజీనగర్, వెంకటగిరితండాల్లో రఘునందన్‌రావు ఇంటింటి ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల రుణాలను పూర్తి స్థాయిలో మాఫీ చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. సీఎం కేసీఆర్ దళిత బంధు, బీసీ బంధు పథకాలను ఒక్కరిద్దరికి ఇచ్చి చిచ్చుపెడుతున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను గెలిచిన రెండున్నరేళ్లలో ప్రతి గ్రామానికి రోడ్లు వేయించానన్నారు. రైతులకు ఉచితంగా ఎరువులను ఇస్తామని చెప్పి ఇంత వరకు ఇవ్వడం లేదన్నారు. గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. బీసీ బంధును గంభీర్‌పూర్‌లో ఇద్దరికి ఇస్తే, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి స్వగ్రామం పోతారంలో 14మందికి ఇవ్వడం దారుణమన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

బీజేపీకి మద్దతుగా..

చేగుంట(తూప్రాన్): మండలంలోని పోతాన్‌పల్లి గ్రామానికి చెందిన దళితులు బీజేపీకి మద్దతు పలుకుతున్నట్లు ప్రకటించారు. గ్రామ నాయకుడు బాలసాయి హరిప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ఇటీవల ప్రధాని ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపినందున తామంతా బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపునకు పని చేస్తామని పేర్కొన్నారు.